సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఇచ్ఛాపురంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా శివారు గ్రామాల ప్రజలకు కూడా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని కుసులవాడ పంచాయతీ రేగానిగూడెం, చిన్నయ్యపాలెం, ఇచ్ఛాపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు శ్మశానవాటిక, తాగునీరు, డ్రైనేజీ సమస్యలను వివరించగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. పంచాయతీలో సంక్షేమ పథకాలకు రూ.14 కోట్లు, అభివృద్ధికి రూ.2.25 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మిగిలిన రాష్ట్రాలకు మార్గదర్శకునిగా మారారన్నారు. అనంతరం ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభించి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తొమురోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, మజ్జి వెంకటరావు, బీఆర్‌బీ నాయుడు, కలిమి గంగరాజు, ఇల్లపు వెంకటరావు, రౌతు వెంకటరావు, గంటా జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



గండిగుండం ఎస్సీ, బీసీ కాలనీలో దుస్తులు అందుకున్న వారితో లత

ఆనందపురం: మండలంలోని గండిగుండం ఎస్సీ, బీసీ కాలనీలో 25 మంది పేదలకు రాజమండ్రికి చెందిన లత అనే మహిళ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి ప్రతినిధులు ఎం.ఎస్.వి.ప్రసాద్, సత్యం, రాజు, లక్ష్మణరావు, వార్డు సభ్యులు శంకర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవీవీకి సత్కారం



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను సత్కరిస్తున్న వెల్లంకి వాసులు

ఆనందపురం: మండలంలోని వెల్లంకి పంచాయతీని సన్సద్ ఆదర్శ గ్రామ యోజన గ్రామంగా గుర్తించి దత్తత తీసుకున్నందున ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను ఆ పంచాయతీ పాలకవర్గ సభ్యులు సోమవారం సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎంపీని కలిసి పంచాయతీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఉప సర్పంచ్ కంచరాన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, పిన్నింటి వెంకటరమణ, పడాల రాము, కంఠిమహంతి చంద్రమౌళి, బూస అప్పలరెడ్డి, బుల్లి రెడ్డి, చెన్నా సత్యం, గొలగాని గోవింద్, కాకర వెంకటరమణ తదితరులు ఎంపీని కలిశారు.

బోరు బావి ప్రారంభం



విలాస్కాన్‌పాలెంలో బోరు బావి ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో అయ్యప్ప స్వామి పీఠం సమీపంలో మండల పరిషత్ నిధులు రూ.లక్షతో నిర్మించిన బోరు బావిని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బోరు బావి ఇళ్ల, కళ్లాల వారికి, విలాస్కాన్‌పాలెం మీదుగా విజయనగరం జిల్లా జామి మండలం వెళ్లే ప్రయాణికులకు తాగు నీటి కోసం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బి.సన్యాసినాయుడు, బి.కృష్ణ, ఆర్.ముత్యాలనాయుడు, ఎన్.సన్యాసినప్పడు, బోని అప్పన్న, బోని అప్పలనాయుడు పాల్గొన్నారు.

'స్పందన'కు 12 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

భీమునిపట్నం: స్థానిక జోనల్ కార్యాలయం వద్ద జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 12 వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి 5, ఇంజినీరింగ్ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగానికి రెండు వినతులు వచ్చాయి. వీటిని పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 స్పందనకు ఒకే ఒక్క అర్జీ వచ్చింది. సోమవారం జోనల్ కార్యాలయంలో జెడ్సీ కె.కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో స్పందన నిర్వహించారు. 6వ వార్డులో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌కి రాకపోకలకు వీలుగా తుప్పలు తొలగించాలని డానియల్ శ్యాం కోరారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214

విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం ద్రోహం

తగరపువలస: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో విభజన హామీలు అమలు చేయకుండా తీవ్ర ద్రోహం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. స్థానిక గుజ్జు రామునాయుడు భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలో కొనసాగాలని బుధవారం నాటికి వెయ్యి రోజుల దీక్ష పూర్తవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు టీడీపీ, జనసేన మనుగడ కోసం ఉక్కు కర్మాగారంపై స్పందించడం లేదన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలు, రైల్వే జోన్‌కు కేంద్ర ప్రభుత్వం సాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను అంబానీ, అదానీలకు దోచుపెడుతున్నారన్నారు. బుధవారం నాటి ఉక్కు ఉద్యమ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు నూలు ఆదినారాయణ, కానూరి రాంబాబు, కొండపు ఈశ్వరరావు, తూతిక సోమరాజు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, చిల్ల అప్పలసూరి, దుంప శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్ రుషికొండలో గల బ్రూబజ్ రెస్టారెంట్‌లో సోమవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన సిబ్బంది అప్రమత్తమై రెస్టారెంట్‌లో ఉన్న ఫర్నీచర్, ఇతర సామాగ్రిని వెలుపలకు తరలించారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. పెద్దగా ఆస్తి నష్టం, ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆరోగ్యశ్రీతో గుండె సంబంధిత సమస్యకు ఉపశమనం



బోడసింగి గిరిజ ప్రభతో సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు

తగరపువలస: విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన బోడసింగి గిరిజ ప్రభ అనే మహిళకు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు గుండె సంబంధిత వ్యాధికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసి ఉపశమనం కలిగించారు. నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజ ప్రభ అయిదు నెలల గర్భవతిగా ఉన్నప్పుడు పక్షవాతం వచ్చి ముఖం, చేయి పనిచేయడం మానేశాయి. భర్త సంతు మెకానిక్ పనులు చేస్తూ గిరిజ ప్రభకు ఖరీదైన వైద్యం అందించలేక సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాడు. గిరిజ ప్రభకు గుండెలోని కవాటాలు పూర్తిగా మూసుకుపోవడమే పక్షవాతానికి కారణమని న్యూరాలజిస్ట్ కె.సౌమ్య గుర్తించారు. అరుదైన ఈ కేసును కార్డియాలజీ వైద్యులు సుజిత్, సురేష్ ఎంతో చాకచక్యంగా బెలూన్ యాంజియోప్లాస్టీ ద్వారా గుండె కవాటాలు తెరిపించారు. హార్ట్ ఫెయిల్యూర్ నుంచి ఆమెను తప్పించగలిగారు. ఇటీవల ప్రసవ సమయంలో కూడా కష్టమైనప్పటికీ గైనిక్ వైద్యులు ఎన్.ఉమ, ఝాన్సీరాణి బృందం కాన్పు చేయించగలిగారు.

అత్యంత అరుదైన ఈ కేసును సమర్థవంతంగా డీల్ చేసిన వైద్యుల బృందాన్ని సోమవారం డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.కృష్ణమూర్తి శాస్త్రి, డాక్టర్ సుజాత రత్నకుమారి అభినందించారు.

పవన్ సతీష్‌కు బెస్ట్ బాక్సర్ ఆఫ్ - 2023 అవార్డు



ఎంవీ పవన్ సతీష్

తగరపువలస: వాకో ఇండియా, కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 2023లో సంయుక్తంగా నిర్వహించిన అన్ని టోర్నమెంట్లలో అత్యధికం గెలిచిన వారికి ఇచ్చే బెస్ట్ బాక్సర్ ఆఫ్ – 2023 అవార్డును సంగివలసకు చెందిన ఎంవీ పవన్ సతీష్ గెలుచుకున్నాడు. అత్యధిక టోర్నమెంట్లు గెలవడంతోపాటు అంతర్జాతీయ పోటీలకు ఎంపికై ఈ ఘనత సాధించాడు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి తెలుగు రాష్ట్ర క్రీడాకారునిగా పేరు నమోదు చేసుకున్నాడు. ఈ సందర్భంగా అకాడమీ యాజమాన్యం, పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. పవన్ సతీష్ మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అంతర్జాతీయ పోటీల్లో భారత్‌కు గోల్డ్‌మెడల్ సాధించడమే తన కలని పవన్ సతీష్ తెలిపారు.

అనంతుని పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు



కుంతీ మాధవ స్వామి

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి పవిత్రోత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీ, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. 8న బుధవారం సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 9న విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠాపన, నిత్య హోమాలు, మహా శాంతి హోమం నిర్వహిస్తారు. 10న పంచామృతాభిషేకాలు, నిత్య హోమం నిర్వహిస్తారు. అనంతరం కుంతీ మాధవ స్వామికి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి, రుక్మిణి, సత్యభామ, వేణుగోపాల స్వామి విగ్రహాలకు, గిరిపై కొలువైన అనంత పద్మనాభ స్వామికి తమిళనాడు రాష్ట్రం శ్రీరంగం నుంచి తీసుకొచ్చిన పవిత్రాలను సమర్పిస్తారు. 11న పవిత్రాలు విసర్జింప చేస్తారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు శాంతి కల్యాణం నిర్వహిస్తారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు



మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న డీఐజీ బాలకృష్ణ

మధురవాడ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రిజిస్ట్రేషన్ కోసం ప్రస్తుతం వాడుతున్న కార్డ్ సాఫ్ట్‌వేర్‌ని మరింత ఆధునీకరించి తీసుకొచ్చామని ఆ శాఖ డీఐజీ బాలకృష్ణ చెప్పారు. సోమవారం సాయంత్రం మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సాఫ్ట్‌వేర్ మరింత భద్రంగా ఉంటుందన్నారు. ప్రజలు తమ దస్తావేజును సొంతంగా తయారు చేసుకోవచ్చని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్లు, తప్పుడు రిజిస్ట్రేషన్లు ఉండవని, పూర్తి సైబర్ సెక్యూరిటీతో కూడి ఉంటుందన్నారు. డాక్యుమెంట్ అప్లోడ్ చేసిన 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలకు లాక్



భీమిలి రోడ్డులో రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనానికి తాళం వేస్తున్న కానిస్టేబుల్

తగరపువలస: భీమిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇకపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తే కుదరదు. అనధికార, రాంగ్ పార్కింగ్ చేసే వాహనాలకు ట్రాఫిక్ పోలీసులు వీల్ లాక్ చేయనున్నారు. ఇటీవల తగరపువలస పరిధిలో ఇష్టారాజ్యంగా యజమానులు తమ వాహనాలను రోడ్ల పక్కన, రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేసేసి వెళ్లిపోతున్నారు. ఇకపై అలా వెళ్లిన వారు భీమిలి వెళ్లి ట్రాఫిక్ పోలీసుల చుట్టూ తిరిగి గంటల కొద్దీ సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తుంది. దీనిపై ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి రావు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలిగిస్తున్న వాహనాలకు చెక్ పెట్టేందుకు ఈ వీల్ లాక్ ఉపయోగపడుతుందన్నారు. రాంగ్ పార్కింగ్ వల్ల వాహనదారులకు కాలయాపనతోపాటు జరిమానా తప్పదని హెచ్చరించారు.

అభ్యసన సామర్థ్యం పెంచేలా బోధన



మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

భీమునిపట్నం: పాఠశాలల్లో విద్యార్థులకు మరింత బాగా అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని, అప్పుడే వారి అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని జోన్ – 1 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి అన్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లోని స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లకు రెండు రోజుల శిక్షణను సోమవారం స్థానిక జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా పాఠ్యాంశాలు చదువుకుంటే మరిన్ని మార్కులతో ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉంటుందన్నారు. అందుకు తగినట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ శిక్షణతో కొత్త పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించవచ్చని, విద్యార్థులకు ప్రయోజనకరంగా వుంటుందని తెలిపారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గౌరీ శంకరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి పాల్గొన్నారు.

మధురవాడ అప్ బ్రిడ్జి కింద ట్రాఫిక్ ఆంక్షలు



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ పరిశీలిస్తున్న సీఐలు వెంకటరావు, రామకృష్ణ

మధురవాడ: మధురవాడ అప్ బ్రిడ్జి, ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందని, ఇందుకు అందరూ సహకరించాలని నార్త్ జోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు అన్నారు. ముఖ్యంగా మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద తరచూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 'నిత్యం ట్రాఫిక్ కష్టాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. లా అండ్ ఆర్డర్ సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ వెంకటరావు అప్ బ్రిడ్జి పరిసరాలను సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం బ్రిడ్జి కింద నుంచి భారీ వాహనాల రాకపోకలు నిషేధించామన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. ఈ ఆంక్షలు ఇక నుంచి కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. ఇందుకోసం డివైడర్ అడ్డంగా పెట్టించామని, అందరూ సహకరించాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడతామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ మురళి పాల్గొన్నారు.

'సురక్ష' శిబిరాల్లో విస్తృతంగా వైద్య సేవలు



వైఎస్సార్ కాలనీలో మందులు అందిస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి



పీఎం పాలెంలో మందులు అందిస్తున్న వైద్యాధికారి సుజాన్

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల్లో రోగులకు విస్తృతంగా వైద్య సేవలు అందుతున్నాయి. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ వైఎస్సార్ కాలనీ, స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని గణేష్‌నగర్, జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలోని బక్కన్నపాలెం యూపీహెచ్‌సీ పరిధిలోని రేవళ్లపాలెం, జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో శివాలయం సమీపంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. వైఎస్సార్ కాలనీలో శిబిరాన్ని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, వైద్యాధికారి చైతన్య, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, బండారు శివలక్ష్మి పరిశీలించారు. అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేశారు.

- జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, వార్డు ప్రత్యేక అధికారి వరప్రసాద్, వార్డు అధ్యక్షుడు బి.అప్పలరాజు, పిల్లా రమణ, వాండ్రాసి సూరి అప్పారావు తదితరులు వైద్య శిబిరాన్ని, అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలించి రోగులకు మందులు పంపిణీ చేశారు.
- జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో శివాలయం సమీపంలో వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అన్ని వర్గాల ప్రజలు తరలి వస్తున్నారని, అందరికీ ఎంతో మేలు జరుగుతోందని, సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.

పీఎం పాలెం: పీఎం పాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత వేద్య శిబిరంలో 564 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశామని వైద్యాధికారి సుజాన్ పల్లా తెలిపారు. నలుగురిని ఆరోగ్య శ్రీ చికిత్సకు ఎంపిక చేశామన్నారు. 73 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. బీపీ, సుగర్ పరీక్షలు చేసి అవసరమైన సూచనలు ఇచ్చామన్నారు. వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, జామి శివకుమార్ పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ



దివీస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో టైలరింగ్ శిక్షణ ప్రారంభిస్తున్న జీఎం ఎంఎస్ఎన్ రావు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోమవారం గ్రామీణ మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణను ప్రారంభించారు. సంస్థ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.రావు మాట్లాడుతూ అన్నవరం, పెదనాగమయ్యపాలెం, చిప్పాడ, మూలకుద్దు గ్రామాల మహిళలకు ఇప్పటికే జ్యూట్ బ్యాగులు, మగ్గం వర్క్, బ్యూటిఫికేషన్, కంప్యూటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), టైలరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. ఇప్పుడు టైలరింగ్‌లో ఏడో విడత శిక్షణ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ట్రైనర్ సుధ, సంస్థ ప్రతినిధులు ఎ.శ్రీనివాసరావు, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి పోలీస్ స్టేషన్ పరిశీలన

తగరపువలస: విశాఖ డీసీపీ – 1 కె.శ్రీనివాసరావు (లా అండ్ ఆర్డర్) సోమవారం సాయంత్రం భీమిలి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయనతోపాటు సీఐ డి.రమేష్ పాల్గొన్నారు.

మళ్లీ మొదటికి చెరువు సమస్య!

తగరపువలస: భీమిలి రోడ్డులో చిట్టివలస – చిల్లపేట పెద్ద చెరువు సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్టయింది. సోమవారం భీమిలి జెడ్సీ బి.రాము మత్స్యశాఖ, ఇరిగేషన్, జీవీఎంసీ అధికారులతోపాటు స్థానికులతో చెరువు వద్ద సమావేశమయ్యారు. ఇటీవల భీమిలి ఎమ్మెల్యే రూ.6.50 కోట్లతో చేపట్టనున్న చెరువు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని స్థానికులు జెడ్సీని కోరారు. దీంతో ఇరిగేషన్, జీవీఎంసీ అధికారులు మాట్లాడుతూ అభివృద్ధి పనులు ప్రారంభించాలంటే చెరువు నీటిని పూర్వం వలే వ్యవసాయ భూముల మీదుగా పంపించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. దీనికి చిల్లపేట, జీరుపేట గ్రామస్తులు అభ్యంతరం చెప్పారు. నమ్మివానిపేట, సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి వ్యర్థాలు చెరువులో కలుస్తున్నాయని, వాటిని అడ్డగించాలని కోరారు. దీంతో చెరువును ప్రక్షాళన చేయడంతోపాటు అభివృద్ధి పనులు ప్రారంభంపై ఏకాభిప్రాయం లేకపోవడంతో మరోమారు చర్చించనున్నట్టు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి జేసీబీతో పూడిక తొలగింపు పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. మత్స్యకారులు చెరువులో తామరతూడును మొత్తం తొలగించారు. జెడ్సీతో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని రామునాయుడు, శిల్లా కరుణాకరరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, జీరు శ్రీనివాసరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్ సమావేశమయ్యారు.

ప్రజా సంకల్ప యాత్రతో సుస్థిర స్థానం



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ ఆరో వార్డు నాయకులు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పిలకవానిపాలెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజలందరి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. సీఎం జగన్ ప్రజా సంకల్పయాత్ర చేపట్టి ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా ఆయన ప్రజలందరి కష్టాలు, సమస్యలు తెలుసుకుని భరోసా ఇచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. నాయకులు అక్కరమాని రామునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్ రెడ్డి, జీవీ రమణ, జగ్గుపల్లి ప్రసాద్, బాకి రమణారెడ్డి, ఆర్.ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

పీఎం పాలెం : ఆంధ్రుల ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జీవీఎంసీ ఆరో వార్డులోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. పీఎం పాలెంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, పోతిన ప్రసాదు, వాండ్రాసి సూరి అప్పారావు, జామి శివకుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

జీవీఎంసీ 7వ వార్డులో కేక్ కటింగ్

మధురవాడ: ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రకు శ్రీకారం చుట్టి 6 వసంతాలు పూర్తయిన సందర్భంగా జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని పిలకవానిపాలెంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, జగ్గుపిల్లి నరేష్, చేకూరి రజని, శ్రీదేవి, మురళీ కృష్ణ, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెప్సీ ఫీడర్ ఏరియాలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున లైన్స్ షిఫ్టింగ్ కోసం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విశాఖ ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బాబానగర్ రోడ్డు, విజేత సూపర్ మార్కెట్ ఏరియా, కార్ షెడ్ కూడలి, 45వ నంబరు సచివాలయం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com